# ఉషోదయం

ఎఱ్ఱని సూర్యకిరణాలు లోకమంతాపరుచుకుంటున్నాయి. ప్రకృతి మేల్కొని వెలుగు తెరలలో దోబూచులాడుతోంది. పక్షులు రెక్కలు విప్పి గానాలు చేస్తూ ఆకాశంవైపు ఎగురుతున్నాయి. మేల్కొన్న జనం ఎవరి పనులు వాళ్ళు చేసుకుంటున్నారు.

ప్రతి యింట్లోను అంటగిన్నెలు తోముతున్న చప్పుడు. తోమిన గిన్నెలు కడుగుతున్న నీటి ధారలశబ్దాలు. ఊరంతా ఏదో సందడి. ప్రతి యింట్లోను ఏదో కలకలం. ఒక వీధి మధ్యలో ఉన్న ఒక యింటి వాటాలో మాత్రం ఏశబ్దమూ లేదు. వేసిన తలుపులు వేసినట్లుగానే వున్నాయి. అయినా ఆ యింటిని పట్టించుకునే వారెవరు అక్కడలేరు. అయినా ఎవరి సందడిలో వారున్నప్పుడు ఆయింటి తలుపులు వేసివున్నాయో తెరిచివున్నాయో ఎవరికి కావాలి ? ఎవరి పనులు వారివి ! అంతలో ఎవరో వచ్చి తలుపులు తడుతూ పిలిచారు.

"అమ్మా! అమ్మా!"

ఎవరు వచ్చి తలుపులు తియ్యలేదు. మళ్ళీ పిలిచారు.

అమ్మా! అమ్మా!

ఆ మాటా యజమానురాలు విశాలి. ఆ పిలుపు ఆమెకు వినబడుతూనే వుంది. తలుపు తియ్యాలనే అనుకుంది. కాని లేచే ఓపికేలేదు. లేని ఓపిక తెచ్చుకుని తలుపుతియ్యాలి. ఆ సమయంలో ఆయింటికి వచ్చేదెవరో విశాలికి తెలుసు. ఆ ఒక్క వ్యక్తిని దూరం చేసుకోవాలని ఆమెకులేదు. లేని ఓపిక తెచ్చుకుంది.

"ఎవరు?" అని ప్రశ్నించకుండా వెళ్ళి తలుపుతీసింది. నిలబడలేనట్టుగా వచ్చి తిరిగి చాప మీద వాలిపోయింది. ఆ వచ్చిన వాళ్ళు ఎవరో కాదు; నాలుగు సంవత్సరాలుగా ఆ యింట్లో పని చేస్తున్న సీతాలు. ఆ పడిపోయిన విశాలిని చూడగానే గాలికి రెపరెపలాడెలేతాకులా వణికిపోయింది సీతాలు. ఒక్క అడుగులో ఆమెను సమీపించింది.

"అమ్మా! పేబాగోలేదా!" అంటూనే వంటి మీద చెయ్యి వేసి చూసింది. ఒళ్ళు చల్లగానే వుంది. అయ్యకొట్టివుంటాడు. అందుకే అలా వుంది అనుకుంది సీతాలు. తరచుగా విశాలిని భర్తకొట్టడం తిట్టడం సీతాలు చూస్తూనే వుంది. ఎందుకు బాదుతున్నాడో ఆమెకు తెలియదు. విశాలిని చూస్తూంటే సీతాలు మనస్సు బాధలో మెలికలు తిరిగింది. కళ్ళలో నీళ్ళు నిలిచాయి. ఏదో అడగాలనుకుంది. కాని విశాలి సమాధానం చెప్పదేమో? భయమేసివుంటుంది అయినా తన పని తాను చేసుకువెళ్ళాలి.

"ఇల్లు తుడుస్తానమ్మా!" ఆమె సమాధానానికి ఎదురుచూడకుండానే తలుపు చాటున ఉన్న చీపురు అందుకుంది సీతాలు.

"సీతాలూ! అనవసరంగా ఎందుకు శ్రమపడతావు; నీకివ్వడానికి నా దగ్గర చిల్లిగవ్వకూడా లేదని తెలుసుగా?"

తుడవడానికి వంగిన సీతాలు తలెత్తి ఆమె వైపు చూసింది.

'పోనీలేమ్మా! ఉన్నప్పుడేయిద్దువుగాని" సీతాలుయిల్లుతుడవ్వడం మొదలుపెట్టింది.

అది యిల్లనడానికి వీలులేదు. అదో గది. అదే హాలు, అదే వంటిల్లు. ఆ గదిని చూస్తే ఎంత బీదతనంలో వున్నారో ఎవరైన వూహించుకోగలరు. ఖరీదైన సామానులు ఏమీలేవు. రెండు సిల్వరు గిన్నెలు చిల్లులుపడ్డ మూతలు, కిరసనాయిలు స్టౌ పక్కగా వున్నాయి. నీళ్ళ కూజాలు రెండు. రెండు స్టీలు గ్లాసులు. ఆ పక్కనే గూట్లో సీనారేకు డబ్బాలు నాలుగు. బియ్యం-పప్పులు-మిరపకాయలు నిత్యావసరవస్తువులన్నిటికీ అవే డబ్బాలు. ఈ సామానుతో సంసారం ఎలా చేసుకోస్తోంది? ఆ గదిని చూసిన వారికి అనుమానంరాకపోదు. ఆగదిని చూసే సీతాలుకి విశాలికి బాగా తెలుసు సామాను సంగతి. ఖరీదైన వంట సామానులు అన్నీ ఒక్కొక్కటే తాకట్టు వాకట్టై ఆ యింట్లోంచి వెళ్ళిపోయాయి. విశాలిని చూసిన వారు మాత్రం బతికిచెడిన మనిషిని ఎవరైన వూహించగలరు. ఆమె ముఖంలోని కళ అటువంటిది. చింకిరి బట్టలతో చప్పిదవడలలో, లోతుకుపోయిన కళ్ళు కూడా ఆమె నాగరికతను చెబుతూనే వున్నాయి.

"అమ్మా! ఒకసారి లేసికూసో. ఈడ కూడా తుడిసేత్తాను!" తప్పదన్నట్టుగా లేచి పక్కకు జరిగింది విశాలి. సీతాలు చాప తీసి దులిపి పక్కగా వేసింది. అది తుంగచాపనడానికి వీలులేదు ఆయింటి గత వైభవానికి చిహ్నంగా వుంది. విశాలి కట్టుకున్న చీరకున్న చిరుగులన్నీ చాపకు ఉన్నాయి. కొన్ని భాగాల్లో చాపకు ముక్కలేలేవు. తల కింద వున్న తలగడా అంతకంటే జీర్ణావస్థలో ఉంది. విశాలి ఆ చింకి మీద ముడిచిపెట్టుకు పడుకుంటుంది.

ఆ చాప దులిపినప్పుడు తుంగ పుల్లలు రాలి కిందపడుతూ వుంటాయి. అందుకే గట్టిగాదులపడానికి భయపడుతుంది సీతాలు.

విశాలి పక్కకు జరిగి తిరిగి ఆ చింకిచాప మీద నడుంవాల్చింది చిరిగిన చీర పమిట కొంగు కాస్త సద్దుకునిచేతులు మీదుగా లాక్కుంది.

అలా పడుకున్న విశాలిని చూడగానే సీతాలుకు కడుపులో దేవి నట్లయింది. గది నలు మూలలా చూసింది. ఎక్కడా అంటగిన్నెలు కనపడలేదు. అయినా తెలుసుకోవాలనుకుంది.

"అమ్మా అంటగిన్నెలేయవా ?"

"అంటగిన్నెలు లేవని తెలీదా? ఎందుకడుగుతావు సీతాలూ !" కళ్ళుమూసుకునే సమాధాన మిచ్చింది విశాలి. ఆమె గొంతు మరింత నీరసంగా వినబడింది. సీతాలుకు భయమేసింది. విశాలి కళ్ళలో నీళ్ళు మాత్రం సీతాలు చూడలేకపోయింది! ఆకన్నీరు ఎవరి కంటపడకుండానే ఆవిరైపోయింది.

ఈయాలిలేవా ?" సీతాలు లేత మనస్సులో ఎన్నో ఆలోచనలు ముసురుకున్నాయి. విశాలి అంట గిన్నెలు లేవని ఎన్నాళ్ళ నుంచి అంటోందో వేళ్ళు లెక్కపెట్టుకోలేక తికమకపడింది సీతాలు. అయినా నాలుగైదు రోజుల నుంచి అంటగిన్నెలు లేవు ? అంటే అన్నం వండు కోడంలేదన్నమాట! పాలుకూడా వద్దంటోంది. అంటే పైసలు లేవేమో? సీతాలు ఆలోచించలేకపోయింది. ఆమె మనస్సు మొద్దుబారిపోయింది.

తల్లిలేని సీతాల్ని తల్లిలా ఆదరిస్తోంది విశాలి గిన్నెలో అన్నం మిగిల్చి రోజూ పెట్టేది. కప్పులో కాఫీ మిగిల్చి పోసేది. పాతగిల్లిన చీరలు చింపిలంగా జాకెట్టు కుట్టించియిచ్చేది. కాని ఈనాడు విశాలికి కట్టుకోడానికి చీరలులేవు. వేళకు కప్పుకాఫీలేదు. తినడానికి పట్టెడు అన్నంలేదు. తల్లినిమించిన తల్లి విశాలి ఆకలితో అలమటిస్తుందని తెలి

యగానె సీతాలు మనస్సు మరిగెపులుసులాకుత కుతలాడింది. మరో వక్క ఏడుపొస్తోంది. విశాలి ఆకలి తీరాలి తానేమి చేయగలదు అలాగె నిలబడిన సీతాలు పరి పరివిధాల ఆలోచిస్తోంది. ఆకలి బాధఎంత భయంకరమైనదో సీతాలుకు బాగా అనుభవం అందుకే మరింతబాధ.

అంతలో పక్కగదిలోనుంచి కాంతారావు "అరుపువినబడింది ఆ అరుపుకు విశాలి మరింత ముడుచుకుపోయింది. సీతాలు చెవుల చెబ్బులి కేకలావినబడింది. ఒక్కక్షణం ఆమె గుండె ఆగి మళ్ళీ కొట్టుకుంది. ఆ అరుపు వింటేతప్ప ఆగదిలో మనుష్యులున్నారని ఎవరు అనుకోరు. ఎప్పుడూ ఆగది తలుపులు పెట్టి వుండడంవల్ల మరోగది వుందనికూడా ఎవరు అనుకోరు? కాని విశాలితో పాటు సీతాలుకు కూడా తెలుసు.

ఈమధ్య తరచు విశాలిని తెలుసున్న ఆడవాళ్ళు సీతాలు అడిగి అసలు విషయాలు తెలుసుకుంటున్నరు. కాంతారావుకు తెలుసున్నవాళ్ళు కూడా యింటికి వచ్చి విశాలితొ మాట్లాడుతున్నప్పుడు సీతాలు వింటూనే వుంది.

కాంతారావు విశాలి ఆయింట్లోకి వచ్చిన కొత్తలో సంతోషంగానే వుండేవారు. కాని తాగుడుకు అలవాటుపడ్డ కాంతారావు సర్వం పోగొట్టు కున్నాడు. సిరి సంపదలు దూరమయ్యాయి. చివరకు ఉద్యోగం కూడా పోయింది. వైద్యంలేక పుట్టిన పిల్లాడుకూడా చనిపోయాడు. ఇప్పుడు తాగి గదిలోనె వుంటాడు. సీసా అవసరమైనప్పుడు ఇంట్లో సామాను భార్య మెడలో వస్తువులు అమ్ముతూ వచ్చాడు. కొత్తలో విశాలి పుట్టింటి నుంచి కొంత తెచ్చి ఖర్చు పెట్టేది ఇప్పుడు వాళ్ళూ దూరమయ్యారు. ఆ అవమానంతో మరింత కుంగిపోయింది విశాలి. పుత్ర శోకంతో ఆ చాపను కరచుకుంది విశాలి. ఆమె మనస్సులాగె, ఆమె దేహంలాగె రోజు రోజుకు శిథిలమవుతోంది ఆ చాపకూడా!

"మొదట్లోనె అదది జాగ్రత్తపడాలండీ! తాగి తందనాలాడు తుంటె మనకే మనుకుంటె ఇదిగో ఈమె సంసారం లాగె తుడిచిపెట్టుకు పోతుంది?" కొందరు ఆమెను ఎత్తిపొడిచారు.

"ఏ ఉద్యోగమో చేసుకోవాలి? అంతేగాని ఉద్యోగం పోగొట్టు కున్న మొగుడితోపాటు ముడిచిపెట్టుకు పడుకుంటె ఎలా? అసలీ ఆడ వాళ్ళె యింత? చాతకానివాళ్ళు?" అన్నారు మరి కొందరు మగమహా రాజులు.

అలా అనేవారెకాని ఆ సంసారాన్ని బాగుచెయ్యడానికి ఎవరూ పూనుకోలేదు.

ఆడుతూపాడుతూ చదువుకున్న విశాలికి పెద్ద డిగ్రీలు లేవు? ఇన్నాళ్ళు యింటిపని అలవాటు పడ్డ ఆమె ఉద్యోగం ఏం చెయ్యగలదు. పెద్ద పెద్ద డిగ్రీలు ఉన్నవాళ్ళకే ఉద్యోగాలుతేవు? రికమండేషనో లంచమో లేనిదే ఉద్యోగం దొరకదని అందరికి తెలుసు? విశాలి నిస్సహాయురాలు ఆమెను ఆదుకునే దెవరు? ఆమె ఘోషను వినేదెవరు?

మరోసారి కాంతానావు అరుపు వినబడింది. ఆది మీదపడుతున్న బెబ్బులి అరుపులా అనిపించింది. అయ్యె డబ్బులు అమ్మకివ్వకుండా తప్పతాగి అరుస్తున్నడు. అమ్మ ఆకలికి అతనే కారకుడు. సీతాలుకు కాంతారావు మీద చెప్పలేని కోపం వచ్చింది.

అంతలో భళ్ళున వాంతి చేసుకున్న చప్పుడయింది. సీతాలు కోపంతో వూగింది. పెదాలు అదిరాయి. ఒక్క అంగలో ఆగది తలుపు దగ్గరకు వెళ్ళి తలుపు తోసింది. ఆ దృశ్యం చూసి వణికింది సీతాలు.

నేలనిండా వాంతులు చేసిన కాంతారావు నేలమీద బోర్లా పడు కుని వున్నడు. చూట్టూ ఖాళీ సీసాలు చిందర వందరగా పడివున్నాయి తలదగ్గర నిండు సీసాలు రెండు వున్నయి.

సీతాలు వణికింది అక్కడి దృశ్యాన్ని చూసి కాదు. తన తల్లి కళ్ళ ముందు నిలచింది. తన తండ్రి కూడా రోజూ యిలాగె తాగి వాంతులు చేసుకునేవాడు. తల్లిని పచ్చిబూతులు తిట్టి చావకొట్టేవాడు. అయినా తల్లి పొద్దుటే కడిగి శుభ్రం చేసేది. పొగాకు ఫ్యాక్టరీలో పని చేసే ఆ తండ్రి ఎప్పుడూ ఇంటికి జీతమిచ్చేవాడు కాదు. ఇంట్లో తిన డానికి తిండిలేదు. కట్టుకోడానికి శుభ్రమైన బట్టలూలేవు. ఆ తల్లి నాలుగిళ్ళు చేసుకుని పిల్లల్ని పెంచుకునేది. ఒకనాడు బాగా తాగి వచ్చిన తండ్రి తల్లిని చావకొట్టాడు. నుదుటికి దెబ్బతగిలిన ఆ తల్లి బాధతో గిలగిల్లాడి ప్రాణాలు వదిలింది. పాలకోసం గిలగిల్లాడిన సీతాలు చెల్లెలు కూడా మరిగుక్క తిప్పుకోలేదు. సీతాలు ఆ శవాలమీదపడి గుండెలు పగిలేలా యేడ్చింది. తండ్రి మాత్రం కాంతారావులాగె వాంతుల మధ్య బోర్లాపడుకుని వర్లుతూనేవున్నాడు. పోలీసులువచ్చి అతన్ని లాక్కు పోయారు. యావజ్జీవకారాగార శిక్ష అనుభవిస్తూ జైల్లో ఉన్నాడు తండ్రి. గతాన్ని భరించలేకపోయింది సీతాలు.

ఈ అమ్మ జీవితం అలాకాకూడదు. చివ్వున తల తిప్పి విశాలి వైపు చూసింది సీతాలు.

తలుపు చప్పుడుకు ఉలిక్కిపడ్డ విశాలి లేచికూర్చుంది. అప్పుడు చూసింది సీతాలు విశాలి నుదుటి మీదున్న పెద్దగాయాన్ని.

'అమ్మా!' అంది కళ్ళు పెద్దవి చేసి చూస్తూ.

ఆ చిరుగు చీర విశాలి బోసి మెడను దాచలేకపోయింది. మెడలో పసుపుతాడు కూడాలేదు. సీతాలు దృష్టి ఆమెడ వైపు పడింది.

''సీసాలుకొనడానికి పైసలు కావాలి. అంటె అమ్మను కొట్టి మెడలోని మంగళ సూత్రాలు గుంజుకుని అమ్మి ఈ సీసాలు తెచ్చు కున్నాడన్నమాట!''

అమ్మ ఆకలితో అలమటించిపోతోంది. అమ్మకు అన్నం పెట్టాలి. ఎలా? ఎలా?

మబ్బుల్లో మెరుపులా ఒక ఆలోచన వచ్చింది సీతాలుకు. తుపాకి గుండులా ముందుకు దూసుకుపోయింది. నిండుగా వున్న సీసాలు రెండు అందుకుని బయటకు వచ్చింది తలుపులు రెండు దగ్గరకు లాగి గడియ వేసింది.

"సీతాలూ! ఆదేంపని? తెలిసిందంటె నిన్ను, నన్ను కూడా బతకనివ్వరే?" ఆశ్చర్యంనుండి తేరుకున్న విశాలి గొంతుకు చించుకుని అరిచింది.

సీతాలు చెవులకు ఆ మాటలు వినబడలేదు. సీసాలు రెండు చిరుగులంగాలో దాచుకుని తూనీగలా వీధుల్లోకి పరుగెత్తింది.

సీతాలు ఆ సీసాలు ఏంచేస్తుందో తెలియని విశాలి మనస్సు తిక మక పడింది. కాని ఆమె సాహసాన్ని మెచ్చుకోకుండావుండలేక పోయింది. నుదుటి దెబ్బ కదిలి రక్తం చిమ్మింది. బాధతో విలవిల్లాడుతూ వాలిపోయింది విశాలి.

ఆలా ఎంత సేపు పడివుందో ఆమెకే తెలియదు.

''అమ్మా! అమ్మా!'' అంటున్న సీతాలు పిలుపుకు కళ్ళు తెరిచింది.

"మళ్ళీ ఎందుకు వచ్చావే?'' అన్నట్లుగా సీతాలు వైపుచూసింది.

''ఇవిగోనమ్మా! సరకులు వంటచేసుకో అమ్మా! అయ్య లేవకుండా నువ్వు తినాలమ్మా!'' దీనంగా విశాలివైపు చూసింది.

''ఆ సీసాలు—అమ్మేసి—నువ్వు''

విశాలి మాటలు పూర్తి కాకుండానే 'అవునమ్మా!' అంది సీతాలు

విశాలి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఈ ప్రపంచంలో ఈనాడు తనెవ్వరికి

అవసరంలేదు. మంచిగా బతికిన రోజుల్లో ఇంటినిండా జనమే! నోటి నిండా పలకరింపులే!

ఏదో మొండి ధైర్యం ఆమెలో ప్రవేశించింది. బియ్యంకడిగి పొయ్యి మీద పెట్టింది. కూర తరగడం మొదలుపెట్టింది.

"ఇప్పుడేవత్తానమ్మా!" అంటూ వీధుల్లోకి లేడిలాపరుగెత్తింది. సీతాలు.

వీధుల్లో చెప్పలేని కోలాహలం. అంతా ఆడవారే? వీధిమధ్యలో వున్న బ్రాంది షాపును మూయిస్తున్నారు ఆడవారు.

సీతాలు ఆశ్చర్యానికి అంతులేదు. ఆనందానికి అంతులేదు తెలిసీ తెలియని బాల్యజ్ఞానం. అంతులేని ఉత్సాహం. ఆషాపును మూయించిన ఆడువారు ముందుకు కదిలివస్తున్నారు. అదో పెద్దప్రవాహంలా ఒకనది· తరలి వస్తోంది. సముద్రం పొంగి వస్తున్నంత కోలాహలం. ప్రతియింటి లోని ఆడువారు ఆ ప్రవాహంలో చేరుతున్నారు.

సీతాలు వారితో కలిసీ విశాలి యింటి వరకు గర్వంగా నడిచింది. వారంతా విశాలి వున్న యింటి ఆవిడతో మాట్లాడుతున్నారు. ఆవిడ విశాలి వున్న గుమ్మం చూపించి ఏమో చెబుతోంది.

సీతాలుకు అర్థంకాలేదు. కాని తెలిసీ తెలియని అంతులేని ఉత్సాహం.

"అమ్మా! అమ్మా!" అంటు లోపలికి పరుగెత్తింది.

అప్పుడే భోజనం చేసిన విశాలి మిగిలిన అన్నంకూర పక్కన పెట్టి చేతులు కడుక్కుంది. సీతాలు పిలుపుకి.

"ఏమిటి?" అన్నట్లు వెనక్కి తిరిగి చూసింది.

సీతాలు దృష్టి మూలనున్న అంట గిన్నెల వైపు పడింది.

"అమ్మయ్యా! అమ్మ అన్నం తింది" అనుకుంటూ విశాలి వైపు

తృప్తిగా చూసింది. మనసులోని భావాలన్నీ చెప్పడానికి సీతాలుకు భాష రాదు.

"అమ్మా! అమ్మా! ఆడోళ్ళందరూ! తాగుడు దుకాణాలు మూయిం చేస్తున్నారుట! మనం కూడా ఆళ్ళతోపాటు పోదామమ్మా!"

సీతాలు మాటలు ఆశ్చర్యంగా వింది విశాలి. అంధకారంలో వున్నట్లుగా నాలుగు గోడల మధ్యలో ఉన్నతనకి బయట ఏం జరుగు తోందో తెలియదు. పేపరు కొని చదువుకునే శక్తిలేదు. తనకిచెప్పే స్నేహితులూలేరు.

"సరే సీతాలూ! ముందు అన్నం తిను".

"నే తింటానమ్మా! నువ్వు ఆళ్ళని చూడాలమ్మా!

విశాలిని బలవంతంగా లాక్కువెళ్ళి చూపించింది. అంతనీరసంగా వున్న విశాలి గుండె వేగంగా కొట్టుకుంది. చదువుకునే రోజుల్లో ఉండే ఉత్సాహం పెళ్ళుమంది. "కల్లు సారా నిషేధించాలి" ఆడవారి నినాదాలు ఊరంతా ప్రతి ధ్వనిస్తున్నాయి. విశాలి మనస్సులో చెప్పలేని సంతోషం. స్వాతంత్ర్యోద్యమకాలంలో ఆంధ్రదేశంలో స్త్రీలే మహాత్ముని పిలుపునందు కుని ఉద్యమం నడిపించారని చదువుకుంది. ఈనాడు కంటి ముందు ఆడవారు. విశాలి మనస్సు పరి పరివిధాల ఆలోచించింది.

సీతాలూ! ఆ రెండు మెతుకులు నోట్లో వేసుకురా! అంటు పక్కకు చూసింది.

సీతాలు ఆగిన్నెల్లో మిగిలిన అన్నం తిని గిన్నెలు కడిగి పక్కన బోర్లిస్తోంది.

సీతాలు చురుకుతనానికి విశాలి ఆశ్చర్యపోయింది. తడిచేయి లంగాకు తుడుచుకుంటూ విశాలి పక్కన నిలిచిన సీతాలు" అమ్మా! వచ్చేసా!" అంది.

ఆ ఉత్సాహమే విశాలిలో వెయ్యియేనుగుల బలాన్ని యిచ్చింది. తలుపులు దగ్గరగా వేసి వీధిలోకి వచ్చిన విశాలి చెయ్యి పట్టుకుంది సీతాలు.

"నా కళ్ళు తెరిపించావు సీతాలు" విశాలి ఆ స్త్రీలమధ్య నిలబడింది ఆమె పక్కనే సీతాలు.

"మద్యపాన నిషేధం—అమలు పరచాలి" భూమి దద్దరిల్లే నినాదం. కల్లు, సారా దుకాణ దారుల గుండెలుగుభిల్లుమంటున్నాయి కాంతారావును హాస్పటల్లో చేర్పించిన విశాలి ఆపూరిలోని కల్లు, సారా దుకాణాలను పూర్తిగా మూయించాలని ముందుకు కదిలింది. సీతాలు ముఖం దివిటీలా వెలిగింది.

వనితాజ్యోతి—
స్త్రీలమాసపత్రిక

❋

❋ ★ ❋

❋